

# సైకాలజీ

**శీలంశెట్టి రమాదేవి**

"ఆ అమ్మాయి ఇవాళకూడా నీగురించి మాట్లాడింది. "

శేషప్ప హోటల్లో కాఫీ త్రాగుతూంటే అన్నాడు రమణారావు.

"ఏమని?" కుతూహలాన్ని కనబడ నీకుండా చాలా మామూలుగా అడిగాను.

"నీ కథలు తనకి చాలా బావుంటా యిట. కొన్ని కొన్ని వాక్యాలు తన డయిరీలో కూడా వ్రాసుకొందిట. నువ్వు నా స్నేహితుడనే సరికి చాలా పొంగి పోయింది. ఒక్కసారి నిన్ను చూడాలని ఉందిట "

ఓ ఆడపిల్ల నా కథలకు ఇంతగా ఇన్‌స్పైర్ అయిందంటే కొంచెం గర్వమేసిందినాకు. వాడు చూడకుండా కాలరు సర్దుకొన్నాను.

"ఇంతకూ ఆ అమ్మాయి పేరేమిటి. ఏం చదువుతోంది, వివరాలు చెప్పవేం?" అసహనంగా అడిగాను.

"ఆ అమ్మాయి పేరు సరస్వతి. మా చెల్లాయితో కలిపి యస్సెల్సీ వరకూ చదివి మానేసింది. మా ఇంటికి నాలుగిళ్ళవతలే వాళ్ళిల్లు. అప్పుడప్పుడు మా యింటి కొస్తూంటుంది "

ఆ తరవాత చాలా విషయాలు మాట్లాడాడు వాడు. అన్నిటికీ ఊ కొడుతూనే ఉన్నానుగాని, ఆలోచనలన్నీ ఆ అమ్మాయి మీదే ఉన్నయి ఆ అమ్మాయి ఎలా వుంటుంది! బావుంటుందా? అందంగా ఉంటుందా? నా మీద అంత అభిమానం ఎందుకూ? అడిగితే వాడేమనుకుంటాడోనని మాట్లాడకుండా ఊరుకొన్నాను.

రోజు రోజుకీ ఆ అమ్మాయిగురించే ధ్యాస ఎక్కువయిపోతోంది నాకు. వారం రోజుల తర్వాత బజార్లో కనబడ్డాడు. కాఫీకి లాక్కుపోయాను.

"ఒరేయ్ రచయితా! నువ్వు కథలు వ్రాయటం నా ప్రాణం మీద కొచ్చింది.

"ఆ అమ్మాయి నిన్ను చూడాలని' ఛంపేస్తోంది. నీ పరిచయం కావాలిట! రేపోసారి మా ఇంటికి రాకూడదూ?''

"రేహ! తప్పదంటావా?'' గుండెలు సంతోషంతో కొట్టుకొంటూండగా అన్నాను.

"ఛరేవాడివిరా! పాపం! ఆ అమ్మాయి అంత గోలచేస్తోంటే బెట్టు పోతావేం?''

"సరే! ఏ టైముకి రమ్మంటావు?''

"సాయంత్రం నాలుగ్గంటలకు వచ్చెయ్! ఆ అమ్మాయి కూడా వస్తుంది''

"సరే!''

ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. ఆడపిల్లల్తో మాట్లాడ్డం బొత్తిగా అనుభవం లేదు. ఇప్పుడీ అమ్మాయితో ఏమి మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? అంతా అగమ్యగోచర మయిపోయింది. అయినా నేనో పేద్ద రచయిత నయినట్లు ఆ అమ్మాయికంత కోరిక ఎందుకూ? మహా అయితే నాలుగయిదు కథలు వ్రాశానేమో పత్రికల్లో! అంతే!

మర్నాడు సాయంత్రం మూడింటికే రమణారావు ఇంటికెళ్ళి కూర్చున్నాను.

"అబ్బబ్బ! రచయిత అంటే ఆ పిల్లకెందుకంత ఇష్టమో నాకు తెలీటం లేదురా! ఇవాళ ఓ పేద్ద పర్వదినంలా ఉంది సరస్వతికి. ఇప్పటికిప్పుడే నాలుగయిదు సార్లు వచ్చి వెళ్ళింది నీకోసం. వచ్చావేమోనని ...'' నవ్వుతూ అన్నాడు వాడు.


వాడి చెల్లాయ్ రెండు కప్పులలో కాఫీ మా ఇద్దరికీ అందించింది. ఓ గంట కబుర్లలో గడిచింది. ఆ అమ్మాయి జాడే కనిపించలేదు నాకు. నాలో ఉత్సాహం రాను రాను సన్నగిల్లి పోతోంది ఆ అమ్మాయి రాదేమోనని. అయిదవుతుండగా ప్రక్క గదిలో కిలకిల నవ్వులు వినిపించాయి.

మాట్లాడుతున్నవాడల్లా ఠక్కున ఆగిపోయాడు రమణారావు.

"అదిగో! ఆ అమ్మాయి వచ్చినట్లుంది. పిలుచుకొస్తానుండు!'' అంటూ లోపలికెళ్ళాడు వాడు. పదినిమిషాల వరకూ వాడి జాడేలేదు. హఠాత్తుగా కర్టెన్ తొలిగించుకొని ఓ అమ్మాయి బయటకు రాబోయి నన్నుచూసి సిగ్గుపడి వెనక్కు వెళ్ళిపోయింది. ఆ అమ్మాయేనా అని అనుమానం వచ్చిందినాకు. చామన ఛాయగా. అందంగా ఉంది. రెండు జడలుండటం మూలాన అందం మరింతగా కనిపించిందేమో! అయిదు నిముషాల తర్వాత రమణరావు బయటికొచ్చాడు.

"పాపం! చాలా సిగ్గుపడి పోయిందిరా మాట్లాడ్డానికి. అందుకని ఇంటికి వెళ్ళిపోయింది!'' అన్నాడు నవ్వుతూ.

నాకు చిరాకేసు కొచ్చింది. ఆ అమ్మాయి గురించి ఎన్నో కలలూ, ఆశలూ పెట్టుకొని, పరిచయం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్న నన్ను ఇలా అన్యాయం



చేయడం వాడికి మర్యాదకాదు.

"ఏడ్చినట్లుంది!" అన్నాను కసిగా.

"మరే! మనకలాగే ఉంటుంది! కాని పెద్ద కుటుంబంలో పుట్టిన పిల్ల! పరాయి మొగాడివంక చూసి కూడా ఎరగదు. ఒక్కసారిగా ఎలా మాట్లాడేస్తుం దేమిటి? ఆ అమ్మాయి పరిస్థితి మనం కూడా గమనించాలి మరి! ఇంతకూ నువ్వా అమ్మాయిని చూశావ్ గదా!"

"ఏం చూట్టమో! చూసే లోపలే వెళ్ళిపోయింది!" అన్నాను నిరాశగా. కాసేపు ఆలోచించాడు వాడు.

"ఓ పనిచెయ్! అంతగా చూడాలని ఉంటే రేపు సాయంత్రం నాలుగింటి కల్లా ఇక్కడికిరా! చెప్తాను!" అన్నాడు.

సరేనని లేచిబయల్దేరాను.

మర్నాడు సాయంత్రం మళ్ళీ అదే టైముకి వాడింటికి వెళ్ళాను. నాకోసమే

ఎదురు చూస్తున్నట్లుంది. నన్ను చూడ గానే "పద!" అంటూ బయల్దేరాడు. ఇద్దరం ఇంటి ప్రక్కనుండు తిరిగాము. నాలుగిళ్ళవతల ఉన్న పంపుదగ్గర ఆ అమ్మాయి బిందెలో నీళ్లు పడుతోంది. మమ్మల్ని చూసి సిగ్గుతో తల దించేసు కొంది. అప్పటి ఆమె అందం నా గుండెల్లో చెరగని ముద్ర పడిపోయింది. వేము ముందుకు వెళ్ళిపోయాము.

వారం రోజులవరకూ రమణారావు నా కన్పించలేదు. కాని ఆ అమ్మాయి రోజూ రాత్రిళ్ళు కలలో తప్పనిసరిగా కనిపిస్తూండేది. రాత్రంతా ఆమె గురించి కలలు. పగలంతా ఆలోచనలు. ఎలా గయినా అమెను చూడాలన్న కోరిక క్రమంగా బలపడిపోతోంది. రమణారా వుతో నిమిత్తం లేకుండా ఒఖ్ఖడినే ఆ అమ్మాయి ఇంటివేపు నడిచాను. ఇల్లు దగ్గరవుతోండగా ఇంటిగేటు తీసుకొని చంకన బిందెతో ఆమె ఎదురు వచ్చింది. నన్ను చూసి కొద్దిగా తడబడి చిరునవ్వుతో తలదించేసుకొని నన్ను దాటి వెళ్లిపోయింది. ఒఖ్ఖ ముక్కయినా మాట్లాడే అవకాశం లభిస్తుందేమోనని ఎదురుచూశాను. కాని పంపుదగ్గరకు మరికొంతమంది చేరుకోవ డంతో ఆ ఆలోచనకు స్వస్తిచెప్పి అక్క డ్నుంచి తప్పుకొన్నాను.

మర్నాడు ప్రొద్దున్న రమణారావు నా దగ్గరకొచ్చాడు. ఇద్దరం కాఫీలు త్రాగు తూండగా "ఏమిట్రా?" అంటూ అడి గాను.

"నిన్న సాయంత్రం నువ్వటు వెళ్లా వుటగదా!" అడిగాడు నవ్వుతూ. నాకు సిగ్గనిపించింది వాడి కీ సంగతెలియటం. బహుశా ఇదంతా ఆ పిల్లే అందజేసిన సమాచార మయివుంటుంది.


"అవును! సరస్వతి చెప్పిందా?" అడిగాను.

"చెప్పడమేమిట్రా! కళ్ళ వెంబడి నీళ్ళొక్కటే తక్కువ!"

"ఎందుకూ?" ఆశ్చర్యపోతూ అడి గాను.

"ఎందుకేముందీ? నువ్వంటే ఆపిల్లకు చాలా ఇష్టం! కానీ వాళ్ళింట్లో అన్నీ పురాతనాచారాలు. పైగా సవతితల్లి పోరు. నిన్ను పిలచి మాట్లాడే అవకాశం లేక పోయిందని చాలా నొప్పు బాధపడింది. నీకే ఈ సంగతి చెప్పాలనుకుకొందిటగానీ నీతో మాట్లాడటం వాళ్ళ సవతితల్లి చూస్తే గొడవయిపోతుందని భయపడిందిట .

నాకు సరస్వతి సవతితల్లి మీద విపరీత మయిన కోపం వచ్చింది. ఆమె సవతి తల్లి చేతిలో అనుభవించే బోలెడు బాధలు కళ్ళముందు ఊహామాత్రం మెదిలి మనసు బాధతో గిలగిల కొట్టుకొంది. రోజూ సరస్వతి ఎన్నిహింసలు మౌనంగా భరి స్తోందో? అమెని ఎలాగయినా సవతితల్లి చెఱనుంచి రక్షించాలనిపించింది. నిన్న




సాయంత్రం ఆ అమ్మాయి దీనంగా చూచిన చూపువెనుక ఇంతగాధ దాగి వుంటుందని ఏమాత్రం అనుకోలేదు. అంత అందమయిన దేవతకి ఇన్ని కష్టాలా?

"నేనిక వెళ్తానా? తనని క్షమించమని చెప్పమని ప్రాణం తీసింది. అందుకే పని కట్టుకొచ్చాను!"

వెళ్ళిపోతూ అన్నాడు రమణరావు.

ఆ రాత్రంతా నాకు కలలు.

సరస్వతిని ఎవరో రాక్షసులు పట్టుకుని ఎత్తుకుపోతూంటే నేను ఆ రాక్షసులతో ఘోరంగా యుద్ధం చేస్తున్నానుట. మర్నాడు మనసంతా అదోలా అయిపోయి ఆఫీసుకి సెలవు పెట్టేశాను. ఆ సాయంత్రానికల్లా నా మనసుకి నిర్ధారణ అయిపోయింది. సరస్వతిలేకుండా జీవించటం నావల్ల కాదు. ఏమయినా సరే ఆమెనే పెళ్ళాడాలి. ఆమెకు కూడా నామీదే ప్రేమఉంది. అభిమానం ఉంది. పెళ్ళాడ్డానికి ఇంత కంటె ఇంకే మదృష్టం కావాలి?

ఆ సాయంత్రమే నా నిర్ణయాన్ని రమణారావుకి తెలియ చేశాను.

"ఆలోచన బాగానే ఉంది! కాని ..." అంటూ నసిగాడు వాడు. నా గుండెల్లో రాయి పడింది.

"కాని ఏమిట్రా?" అడిగాను ఆత్రుతగా.

"వాళ్ళు బీదవాళ్ళు! కట్నం అవీ ఏమాత్రం ఇచ్చుకోలేరనుకొంటాను. అయినా నేను వాళ్ళింటికెళ్ళి ఆ అమ్మాయి పెద్దాళ్ళను మీ యింటికి పంపే ఏర్పాటు చేస్తాను. నువ్వు మీ వాళ్ళ సంగతి చూసుకో!" అన్నాడు.

నెల రోజుల తర్వాత మా వివాహం వైభవంగా జరిగింది. ఎంతో అందంగా అలంకరించుకొని గదిలోకి వచ్చింది సరస్వతి.

"ఇప్పుడు పరిచయం చేసుకోనా? లేక పోతే ఆరోజులా సిగ్గుపడి పారిపోతావా?" అడిగాను నవ్వుతూ.

"ఏ రోజు.... నేను సిగ్గుపడి పారిపోవడమేమిటి?" అందామె విచిత్రంగా నావంక చూస్తూ.

"అదే! రమణారావు ఇంట్లో! నాతో మాట్లాడాలని రమ్మన్నావు కదా ఆరోజు! తీరావస్తేనేమో బయటి కొచ్చి నన్నుచూసి సిగ్గుపడి వెళ్ళిపోయావ్!"

"కథ చెప్తున్నారా?"

"ఛవ్! కథకాదు!"

లేపోతే ఏమిటండీ! ఆ రోజు నేనూ రమణారావు చెల్లెలూ సినిమా ప్రోగ్రాం వేసుకొన్నాం! ఫలానా కథవ్రాసేది మీరే నని రమణారావు అంటే చూద్దామని బయటికొచ్చి చూశాను ..అంతేగాని మిమ్మల్ని రమ్మని కబురుచేయలేదే?"

నాకు తల తిరిగినట్లయింది "మరి రమణారావు గాడు అలాచెప్పేడేం?"

"సరే! పోనీలేగాని .. నేను నిన్ను ఎందుకు పెళ్ళిచేసు కొన్నానో చెప్పు ..."

"ఏమో! .... మీ కంటికి నచ్చాను గాబోలు...."

"నచ్చుట మొక్కటే కాదు....ముందు నిన్ను మీ సవతితల్లి బారినుండి తప్పించేయా లనిపించింది. ఆ రోజు పంపదగ్గర మాట్లాడలేకపోయినందుకు క్షమించమని రమణారావుతో చెప్పిపంపించింతర్వాత ఇక ఉండలేకపోయాను...."

"అదిగో! ఇంకో కథ మొదలెట్టేరు! రమణారావుతో అలా అని ఏమీ చెప్పనే లేదు నేను. పైగా సవతితల్లి అంటా రేమిటి? ఆవిడ మా సొంత అమ్మ! ఎవరు చెప్పారు మీ కివన్నీ కల్పించి?..."

"మరి ..రమణారావు..."

"అబ్బ! మీ రాగొడవలు కాసేపు మర్చిపోగూడదూ! మీరు రోజూ నా గురించి అడుగుతున్నారనీ, నన్ను ఓసా రయినా రోజూ చూడలేకపోతే ఉండలే రనీ. అంచేతే మా ఇంటిచుట్టూ తిరగడం మొదలెట్టారనీ రమణారావు అంటూండే వాడు నాతో...అయినా ఇప్పుడెందుకా సంగతులన్నీ....వేరే విషయాలే మీ లేవూ? .." అంది సరస్వతి నవ్వుతూ.

రమణారావు ఏదో నాటకం ఆడదని పించింది నాకు. అదే ప్రొద్దున్న కడిగే శాను వాడిదగ్గర.

"ఓసేయ్! సరస్వతి నా చెల్లాయి లాంటిది. కాపోతే కొంచెం బిడియాళ్ళు. ఆ అమ్మాయి నువ్వూ ఓటయితే బావుంటుందని ఎంచేతో అనిపించింది నాకు. లేనిపోనివి కలిపించి చెప్పాను. సరస్వతి అసలు నీ కథలే చదువలేదట ఇంత




వరకూ. నీగురించి ఎప్పుడూ నన్నడగనే లేదు. అదంతా ఓ చిన్న సైజు సైకలాజికల్ ప్రయోగం। అంతే। నేననుకొన్నది అనుకొన్నట్లయింది. మీకు ఇష్టంలేదూ. వెంటనే విడాకులు ఇచ్చేసుకోండి। నాకేం అభ్యంతరం లేదు.... వస్తా।''

గడపలోనుంచుని కిలకిల నవ్వుతోంది సరస్వతి.

---